# మధురభక్తి మందారమాల

పదకర్తలలో అన్నమాచార్యులు మధురభక్తి ప్రస్థానంచేసిన భాగవతోత్తముడు. పద్య రచనలో పోతనగారిదొక పద్ధతి; పద్యరచనలో అన్నమయ్యగారిది మరొక పద్ధతి. పోతనగారు శబ్దంతో, అర్థంతో పఠితల మనసులను లాస్యంచేయించి భక్తి భావతన్మయత్వాన్ని కలిగిస్తారు. అన్నమయ్యగారు రాగంతో రంగరించిన భావంతో భక్తులమనసులను పరవశింపచేసి వేంకటేశుని భక్తిమాధుర్యంలో ముంచెత్తుతారు. పోతనగారి కవితలో శబ్దానిది పైచేయి; అన్నమయ్యగారి కవితలో అర్థానికే అగ్రతాంబూలం. మల్లెపూలకంటే మెత్తనైన మాటలు, మకరందంకంటె మధురమైన భావనం, నవనీతంకంటె మృదువైన అభివ్యక్తి. అమృతంకంటె రుచియైన భావానురక్తి అన్నమయ్యగారి కీర్తనల్లో అమృతవర్షిణిగా జాలువారుతుంటాయి. అందువల్లనే కాబోలు ఈ సరళవ్యాఖ్యగ్రంథాన్ని 'అన్నమాచార్యుల అమృతవర్షిణ' అనే పేరు సార్థకంగా ఉంచారు.

వ్యాఖ్యాత శ్రీ ఇవటూరి వేంకట సీతాపతిరావుగారు సంగీత సాహిత్యాలను శ్వాసకోశాలుగా పోషించుకొనే రసికులు. వారిలో ఒక విశిష్ట సంశ్లిష్ట వ్యక్తిత్వం అమృతవాహినిగా జాలువారింది. వృత్తికి పారిశ్రామ్యవాది; ప్రవృత్తికి సాహిత్య సంగీత రస రమ్యవాది. పుట్టుకతోవచ్చిన సంగీత సహజ పాండిత్యం; పెద్దలవద్ద నేర్చుకున్న వేదవిజ్ఞానం, మిత్రుల స్నేహంలో సేకరించినన సాహితీ సంస్కారం, దైవదత్తంగా వచ్చిన ధారణాశక్తి.పూర్వజన్మ సుకృతం వల్ల ఏర్పడిన పదకవితా రచనాశక్తి - ఇవన్నీ కలిసి వారి ఈ వ్యాఖ్యాన గ్రంథరచనకు పూర్వరంగాన్ని సిద్ధం చేశాయి. గతానుగతికంగా వ్రాయటం సీతాపతిరావుగారి బాటకాదు; తన అనుభవాన్ని ఎదుటి వారి కంటేటట్లు అభివ్యక్తీకరించడం ఆయన ప్రత్యేకత. ఈ సరళవ్యాఖ్య సంకీర్తన సౌరభాలను వెదజల్లుతోంది. సంకీర్తనకు సంగీతం ఒకరెక్క, సాహిత్యం మరోరెక్క. ఆ రెండూ ఆడితే తప్ప ఈ గీతవిహంగం భావాంతర వీధుల్లో విహరించలేదు. మిత్రులు శ్రీ సీతాపతిరావుగారు ఉభయశక్తులూ ఉన్న ప్రతిభావంతులు కావడంతో అన్నమయ్యకీర్తనలకు అన్వయం చెప్పే అమృతధారగా అమరింది.

అన్నమయ్య సాహిత్యాన్ని సామాన్య ప్రజల్లోకూడా విశేషంగా ప్రచారం చేయడానికి ఇటువంటి సరళవ్యాఖ్య గ్రంథాలు అవసరం. ఇందులో ఎన్నిక చేసిన కీర్తన ఒక్కొక్కటీ ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించుకొన్నది; అన్నమయ్య భక్తిరసమహాసముద్రంలో ఉవ్వెత్తు గాలేచిన ఒక్కొక్క తరంగం లాంటిది. శ్రీ సీతాపతిరావుగారి వ్యాఖ్యానం బంగారానికి తావిలా అబ్బిన అపూర్వసంఘటన. భావాన్ని ప్రసన్నంగా వివరించి చెప్పడం,భావంలోని సూక్ష్మదశలను విశ్లేషించి వివేచించటం, ప్రతిపాదించే అంశాలకు ప్రాచీన సాహిత్యం నుంచి ప్రమాణాలను చూపించడం, కొసమెరుపుగా స్వీయసమన్వయాన్ని సంఘటించ టం - అనే గుణాలు ఈ సరళవ్యాఖ్యకు సహజంగా అమరిన అలంకారాలు.

అన్నమయ్య కీర్తనలోని శృంగారానికి యోగపరంగా చెప్పుకునే వ్యాఖ్యానానికి "ఇది గాక సౌభాగ్య..." కీర్తనం ఉదాహరణం. అలమేలుమంగ వేంకటేశ్వరునితో సలిపే శృంగా రకేళి బహిరంగానికి శృంగారం; అంతరంగానికి శ్రీ యోగవిద్యాతంత్రరహస్యం. ఆదిశంక రుల సౌందర్యలహరిలోని "మహీంమూలాధారే" అనే శ్లోకాన్ని ఆధారంగా చేసికొని 'శృంగారలక్ష్మీ హృదయమంత్రం'గా అన్వయించడం శ్రీ సీతాపతిరావుగారి మధురతాత్త్వి క దృష్టికి నిదర్శనం (చూడు. పు. 30-33) " తొల్లి కలవే యివియు" అనే కీర్తనకు వ్రాసి న వ్యాఖ్య మరోరకమైన ప్రజకు ఉదాహరణం. నరనారాయణులకు అన్వయించి అర్థవిశ్లే షను వివరించే శక్తి ఒకవైపు ప్రదర్శిస్తూనే, అన్నమాచార్యులకూ అయన్‌స్టీన్‌కూ ఉన్న సంబంధాన్ని సమీక్షించే ఆధునిక విజ్ఞానదృష్టిని మరొకవైపు ప్రదర్శించిన వైఖరి ఈ వ్యాఖ్య చూపిస్తుంది. వేదాంతం విజ్ఞానానికి విరుద్ధం కాదు; విజ్ఞానం భక్తికి విదేశీయం కాదని ఈ వ్యాఖ్య నిరూపిస్తోంది. ఆధునిక జీవితానికి అన్నమయ్యకు అన్వయించడం శ్రీసీతాపతిరావు గారి వ్యాఖ్య విశేషం.

వ్యాఖ్యకు జీవగర్ర తులనాత్మక పరిశీలనం. అది పూర్వకవుల కవితతో కావచ్చు; పూ ర్వశాస్త్రవిజ్ఞానంతో కావచ్చు; "సందెకాడ బుట్టినట్టి" కీర్తనకు వ్రాసిన వ్యాఖ్య ఇటువంటి శక్తికి నిదర్శనం. వర్ణ్యవస్తువు 'చందమామ'. వ్యాఖ్యసీమలో ధూర్జటికీ అన్నమయ్యకూ మధ్య తులనాత్మక పరిశీలనం. చందమామ పాటలోని అమృతవారాశిలో జ్యోతిశ్శాస్త్ర

రహస్యరత్నాల అన్వేషణ; చంద్రికామంత్రకళారహస్యమనే అమృతకోశంయొక్క ఆవిష్కరణ. ఇటు సాహిత్యం; అటు వేదోపనిషత్తులు; ఇటుశాస్త్రం; అటు మంత్రతంత్రాలు; ఇటు ఇహలోకం; అటు పరలోకం; ఇటు శృంగారం; అటు ఆధ్యాత్మికం - ఇన్ని దిక్కులా, అన్ని దిక్కులా, కమ్ముకున్న వ్యాఖ్య పరిపూర్ణతను సాధించుకున్న సాహితీయోగం. ఇలా వివరిస్తూపోతే ఎన్నో విశేషాలు; ఎన్నో రుచులు. ఈ అమృతం త్రాగండి; దేవతలుకండి; దేవ దేవుణ్ణి దర్శించండి. సంకీర్తన రచన అలమేలుమంగపతికి అక్షరార్చన; సంకీర్తన గానం శ్రీవేంకటేశుని భక్తికి అమృతవర్షిణి; ఈ వ్యాఖ్యానం ఆనందరూపుని కందించే మధురభక్తి నైవేద్యం. ఈ నివేదన స్వామికి 'అలమేలుమంగ అధరామృతం' సహృదయులకు "అమృతభావాల ఆలోచనామృతం".

డా. జి. వి. సుబ్రహ్మణ్యం
అధ్యక్షులు ఆంధ్రశాఖ
కేంద్రీయ విశ్వవిద్యాలయం
హైదరాబాద్.